క్లుప్తంగా

మిర్యాలగూడలో న్యాయవాదుల ఆందోళన

మిర్యాలగూడ టౌన్ : హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టుకు చెందిన న్యాయవాదిపై పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ కార్యదర్శి సకినాల వేలాద్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ సివిల్ కోర్టుకు చెందిన న్యాయవాదిపై అకారణంగా పోలీసులు దాడి చేయడం సరైంది కాదన్నారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి పవన్‌కుమార్, ఉపాధ్యక్షులు స్వామిప్రసాద్‌లతో పాటు జూనియర్, సీనియర్ న్యాయవాదులు తదితరులున్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అజహర్ అహ్మద్

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం దామరచర్ల మండలం బొత్తలపాలెంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆరోగ్య రక్షణపై డాక్టర్ అజహర్ అహ్మద్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వైద్య సేవలతో పాటు మెలకువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ దుర్గ, కవితలతో పాటు ఆదర్శ పాఠశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నందులాల్ మృతి బాధాకరం



నందులాల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రవీంద్రకుమార్

చందంపేట : చందంపేట మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామానికి చెందిన నేనావత్ నందులాల్ మృతి బాధాకరమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో నందులాల్ మతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు లోక్యనాయక్, శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు



బెంచీలు ఏర్పాటు చేయిస్తున్న దాత

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్లకంటిగూడెం గ్రామానికి చెందిన గడ్డ కళమ్మ కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు గడ్డం అచ్చిరెడ్డి పెద్దదేవులపల్లి, నర్లకంటి గూడెం గ్రామాల్లో గ్రామస్తుల సౌకర్యార్థం ప్రధాన సెంటర్లు, పాఠశాల వద్ద సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడం సంతోషంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంబటి వెంకన్న, సతీష్, నరేష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి ఎంపీడీఓగా బాలరాజురెడ్డి



కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి ఎంపీడీఓగా బాలరాజురెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన రాంరెడ్డి చండూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన బాలరాజురెడ్డి కొండమల్లేపల్లికి వచ్చారు. కాగా ఇక్కడ ఎంపీడీఓగా పని చేసి బదిలీపై వెళ్తున్న రాంరెడ్డిని గురువారం మాజీ ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

హామీలు అమలు చేయాలి

మిర్యాలగూడ : రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో లఖీమ్‌పూర్ ఘటనలో అమరులైన రైతులకు రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక సీపీఎం కార్యాలయంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మల్లేష్, సత్యనారాయణ, సత్యనారాయణరావు, గోవింద్‌రెడ్డి, కోటిరెడ్డి, రామకృష్ణ, రాజేష్, లింగానాయక్, భాషా పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనం పూర్తయ్యేదెన్నడో..

- నాలుగు నెలలుగా నిలిచిన ఏరియా ఆస్పత్రి అదనపు భవనం పనులు
- రోజు రోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్య
- పాతభవనం సరిపోక వరండాలోనే చికిత్స అందిస్తున్న వైద్యులు



నిర్మాణ దశలో ఉన్న ఏరియా ఆసత్రి అదనపు భవనం

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ డివిజన్ పరిధిలో అతిపెద్ద ఆస్పత్రిగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి పేరుంది. వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా అందుబాటులో ఉన్న వంద పడకల ఆస్పత్రి కి అదనంగా మరో వంద పడకలు కలిగిన నూతన బిల్డింగ్ నిర్మించి ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఆ భవనం పనులు మాత్రం ఇంకా పూర్తికావడం లేదు.

రూ.16 కోట్లతో నిర్మాణ పనులు..

కాగా నూతన బిల్డింగ్ నిర్మాణం కోసం రూ. 16 కోట్ల కేటాయించిన ప్రభుత్వం భవన నిర్మాణానికి వడివడిగా అడుగులు వేసింది. గతేడాది అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు స్వయంగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి వచ్చి నూతన బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి భవన నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగగా ఏడు నెలల కాలంలోనే రెండస్తుల భవనం స్లాబ్‌లు పూర్తి చేశారు. సంవత్సరంలోనే బిల్డింగ్ పనులు పూర్తి చేసి జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉండగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఘనవిజయం సాధించి అధికారం చేపట్టింది. గత ప్రభుత్వం చేసిన పనులపై రాష్ట్ర ప్రభుత్వం సమాలోచనలు చేస్తుండటంతో భవన నిర్మాణానికి నిధుల విడుదలపై సందిగ్ధం నెలకొంది. నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో బిల్డింగ్ నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో నాలుగు నెలలుగా భవన నిర్మాణం పనులు ఆగిపోయాయి.

వందపడకల ఆస్పత్రికి రెండు వందల మంది రోగులు..

కాగా ఏరియా ఆస్పత్రికి రోజురోజుకు రోగుల తాకిడి పెరిగిపోయి వంద పడకల ఆస్పత్రి సామర్థ్యం ఉన్న ఆస్పత్రికి రోజుకు రెండు వందల మంది రోగులు వస్తుండటం, 150కి పైగా రోగులు అడ్మిట్ కేసులు ఉండటంతో పడకలు, గదులు సరిపోవడం లేదు. దీంతో రోగులను వరండాలో అదనంగా బెడ్స్ వేసి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రి సామర్థ్యానికి మించి రోగులు వస్తుండటం వలన ఆస్పత్రిలో పారిశుద్ధ్యం కూడా సక్రమంగా ఉండటంలేదని రోగులు అంటున్నారు. వరాండాలో సరైన దుసుపాయాలు లేక రోగులు అవస్థలు పడుతుండగా రోగుల తాకిడికి అనుగునంగా వైద్య సిబ్బందిని సైతం పెంచాల్సి ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా.. ఏరియా ఆస్పత్రిలో నిర్మాణమవుతున్న అదనపు వంద పడకల నూతన బిల్డింగ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్డింగ్ పూర్తయితే మెరుగైన వైద్యం



ఏరియా ఆస్పత్రిలో నిర్మాణమవుతున్న నూతన భవనం పూర్తి అయితే రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది. ఆస్పత్రి సామర్థ్యానికి మించి వస్తున్న రోగులకు సరిపడా బెడ్స్ లేకపోవడంతో ఒక్కోసారి ఒక్కో బెడ్‌లో ఇద్దరు రోగులను పడుకోబెట్టాల్సి వస్తుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు కూడా విన్నవించాం. త్వరలోనే బిల్డింగ్ నిర్మాణం పూర్తి అవుతుందని ఆశిస్తున్నా.

– డాక్టర్ శ్రీనివాస సమరథ్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఎం రమేష్

దేవరకొండ : ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేష్ కోరారు. గురువారం డిపో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ డిపో నుంచి సంతోష్‌నగర్ (హైద్రాబాద్) వరకు రెగ్యులర్ బస్సు సర్వీసులతో పాటు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 52 బస్సు సర్వీసులు, 13 నుంచి 16వరకు 32 బస్సు సర్వీసులు నడుపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. ఇప్పటికే దేవరకొండ నుంచి పుణ్యక్షేత్రాలకు సైతం బస్సు సర్వీసులు పునరుద్ధరించినట్లు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే మెరుగైన ప్రయాణ సేవలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి



శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటేశ్

మిర్యాలగూడ : రాష్ట్రంలో యువజన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని ఆ సంఘం నాయకులు మిట్టపల్లి వెంకటేష్ అన్నారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉదయ్‌భానుచిబ్‌ను గురువారం ఢిల్లీలో కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందేలా తనవంతుగా సహకారం అందిస్తానని తెలిపినట్లు చెప్పారు.

జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాయి ప్రకర్ష ఒకేషనల్ జూనియర్ కాలేజీలో గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రకరకాల పువ్వులతో బతుకమ్మలను పేర్చారు. విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలు ఆడారు. అనంతరం కళాశాల అకాడమిక్ అడ్వైసర్ కె.మల్లిఖార్జున్ బతుకమ్మ ప్రాధాన్యాన్ని తెలియజేశారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ బాలు

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బాలు అన్నారు. గురువారం స్థానిక మండల రిసోర్స్ కేంద్రంలో ఇటీవల జాతీయ స్థాయి చిత్రలేఖనంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతారన్నారు. చిత్రలేఖనంలో జాతీయ స్థాయిలో మిర్యాలగూడకు మంచి గుర్తింపు తీసుకరావడం చాలా ఆనందంగా ఉందన్నారు. మట్టిలో మాణిక్యం లాంటి కళాకారులను తీర్చిదిద్దుతున్న చిత్రకారుడు యినుగుర్తి విజయ్‌కుమార్‌ను ప్రత్యేకంగా ఎంఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

తిరుమలగిరి(సాగర్): నెల్లికల్లు గ్రామపంచాయతీ పరిధి/ లోని చెంచువానితండాకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త సావిటి బాలు ఇటీవల మృతిచెందాడు. అతడికి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత ఉండటంతో ఆ పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును గురువారం కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అందజేశారు. ఈసందర్భంగా భగత్‌కుమార్ బాలు నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గత కొన్ని రోజుల క్రితం సావిటి బాలు రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన వెంట పిడిగం నాగయ్య, కూరాకుల వెంకటేశ్వర్లు, పెద్దిరాజు, కార్తీక్, రమేశ్‌నాయక్, ఇద్దిరాములు, మోహన్, చందర్, బానురాథోడ్, మంద శ్రీను, కాశయ్య, బుర్రి రామయ్య పాల్గొన్నారు.

సిమెంట్స్ ఫ్యాక్టరీపై పీసీబీ చర్యలు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని గణేష్‌పాడులోని సిమెంట్స్ ఫ్యాక్టరీపై కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం సిమెంట్స్ ఫ్యాక్టరీ కాలుష్యాన్ని నియంత్రించడంలో విఫలం కావడంతో గురువారం పీసీబీ అధికారులు ప్లాంట్‌లో సిమెంట్స్ ఉత్పత్తిని నిలిపివేశారు. ఉత్తర్వులు జారీ చేసేంతవరకు ఫ్యాక్టరీలో ఉత్పత్తులు తయారు చేయవద్దని అధికారులు ఆదేశించినట్లు సమాచారం. సుమారు రెండు నెలల క్రితం సదరు ఫ్యాక్టరీ పెన్నా సిమెంట్స్ యాజమాన్యం ఆధీనంలో ఉండగా అదానీ గ్రూప్ ఇటీవల కొనుగోలు చేసింది. ఏడాదికి 1.2 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ ఫ్యాక్టరీ ప్రస్తుతం అంబుజా సిమెంట్స్ పేరుతో ఉత్పత్తిని విడుదల చేస్తున్నారు. ఫ్యాక్టరీ విపరీతంగా కాలుష్యాన్ని వెదజల్లుతుందని స్థానికులు పీసీబీకి ఫిర్యాదు చేయడంతో గురువారం చర్యలు చేపట్టారు. ఫ్యాక్టరీపై ఇప్పటివరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించలేదని అటవీ భూముల్లో, రహదారుల నిర్మాణంతోపాటు నిబంధనలను తుంగలో తొక్కినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పీసీబీ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు. తహసీల్దార్ ను వివరణ అడగగా సమాచారం లేదని తెలిపారు.

కుటుంబ సభ్యుల వివరాలు సమగ్రంగా సేకరించాలి



మిర్యాలగూడ : రుద్రారంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



హాలియా : కొణతాలపల్లిలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్



నాగార్జునసాగర్ : నందికొండలో ఇంటింటి సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

మిర్యాలగూడ : మండలంలోని రుద్రారంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ సర్వేను గురువారం సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, ఎంపీడీవో శేషగిరిశర్మలు ప్రారంభించారు. గ్రామంలో 188 కార్డులు ఉన్నట్లు తెలిపారు. ఎంపీడీఓ అధికారిగా ఉన్న టీంలో జూనియర్ అసిస్టెంట్ జమీల్‌పాషా, వేణుగోపాల్, మెంబర్లుగా పంచాయతీ కార్యదర్శి సైదులు, ఎంపీఓ మాతంగి రమేష్‌లు ఒక టీంలగా, 2వ టీం అధికారి సీనియర్ అసిస్టెంట్ షహబాద్, జూనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌లు ప్రతి ఇంటికి వెళ్లి డాటా సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే ఐదు రోజులపాటు ఉంటుందని ప్రతి కుటుంబసభ్యులు వారి పుట్టిన తేదీ, వయస్సు, ఆధార్‌కార్డు నంబర్, ఫోన్‌నంబర్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఫ్యామిలీ డిజిటల్‌కార్డు కుటుంబ యజమానురాలు, మహిళల పేరున జారీ చేయనున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని 23వ వార్డులో గురువారం డిజిటల్ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరిబాబు మాట్లాడుతూ ఈ డిజిటల్ సర్వేలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక కౌన్సిలర్ ఇలియాస్, ఆర్‌ఐ సత్యనారాయణ, రామకృష్ణ, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం

త్రిపురారం : ప్రభుత్వ నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యుల వివరాలను సమగ్రంగా సేకరించాలని హౌసింగ్ పీడీ రాజ్ కుమార్ సూచించారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం మేరకు నాగార్జునసాగర్ నియోజకవర్గంలో త్రిపురారం మండలంలోని కొణతాపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అధికారులు రెండు బృందాలుగా ఏర్పాడి గ్రామంలో గురువారం కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ రాజ్ కుమార్ సర్వే నిర్వహిస్తున్న గ్రామంలో పర్యటించి అధికారులు సేకరించిన వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం పీడీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి డిజటల్ కార్డు రానున్న నేపథ్యంలో గ్రామస్తులు వివరాలను సక్రమంగా చెప్పాలన్నారు. కొణతాలపల్లిలో 200కుటుంబాలు ఉండగా మొదటి రోజు 53 కుటుంబాల సర్వే పూర్తి కాగా 18కుటుంబాలు కొత్తగా చేర్చి, మరణించిన కారణంగా 27 మందిని తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ కుమారి, తహసీల్దార్ ప్రమీలా, సీనియర్ అసిస్టెంట్ భరత్వాజ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దేవరకొండ : ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉన్నట్లుగానే ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు జారీకి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. అందులో భాగంగా దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో గురువారం సర్వేను దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డులో సంబంధిత అధికారులు వార్డుల్లో ఆయా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి నమోదు చేశారు. అనంతరం ఆర్డీఓ శ్రీరాములు మాట్లాడుతూ వార్డులో రెండు బృందాలను ఏర్పాటు చేయగా ఒక్కో బృందంలో ఐదుగురు సభ్యులుంటారని తెలిపారు. 7వ తేదీలోగా సర్వే పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సంతోష్ కిరణ్, స్థానిక కౌన్సిలర్ కొండ్ర మల్లేశ్వరి శ్రీశైలంయాదవ్, మున్సిపల్ ఏఈ రాజు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : సంక్షేమ పథకాలను ఇతర అవసరాలకు అన్నింటిని ఒకే గొడుకు కిందకు తీసుకవస్తూ ప్రతీ ఒక్కరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులను అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. అందుకుగాను పైలట్ ప్రాజెక్టు కింద నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీలో 11వ వార్డును ఎంపిక చేశారు. గురువారం పెద్దవూర మండల రెవెన్యూ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. కుటుంబంలో ఎంత మంది ఉన్నారు. వారిపేర్లు వృత్తి తదితర అంశాలను రికార్డు చేస్తున్నారు. వార్డులో 300ఇళ్లు ఉండగా 72ఇళ్లలో సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర మండల స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, తహసీల్దార్ సరోజ పావని ఆర్‌ఐలు దండ శ్రీనివాసరెడ్డి, నవీన్, వార్డుల అధికారులు పాల్గొన్నారు.

చందంపేట : డిజిట్ రేషన్ కార్డుల కోసం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన చందంపేట మండలంలోని అచ్చంపేటలో గురువారం తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామస్తులు డిజిటల్ కార్డుల కోసం తమ వివరాలను రెవెన్యూ అధికారులకు అందించాలని కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచులు జర్పుల లోక్యనాయక్, బద్యానాయక్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



మిర్యాలగూడ టౌన్ : భవానినగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భవానీ మాలధారులు



హాలియా : అంగడి బజార్‌లో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



హాలియా : భవాని దీక్ష స్వీకరిస్తున్న భక్తులు



మిర్యాలగూడ అర్బన్ : యాద్గార్‌పల్లి గ్రామంలో..

దేవీనవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో గురువారం అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీ బాల త్రిపుర సుందరీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లేత గులాబీ రంగు వస్త్రాన్ని సమర్పించారు. యువత భవాని మాత మాల ధారణను ధరించి అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



హాలియా : అమ్మవారి వద్ద కుమారి పూజ నిర్వహిస్తున్న పురోహితుడు



త్రిపురారం : పెద్దదేవులపల్లిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు



చింతపల్లి : పూజలు చేస్తున్న భక్తులు



కొండమల్లేపల్లి : అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

భార్యాభర్తలిద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు

హాలియా : ప్రభుత్వ కొలువు సాధించడమే గగనమైన ఈ రోజుల్లో భార్యభర్తలిద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. అనుముల మండలంలోని మదారిగూడెంలో రైతు కుటుంబానికి చెందిన ఆవుల శ్రీనివాస్, సిద్దాల బాలమణి దంపతులు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. సెప్టెంబర్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గురుకుల ఫలితాల్లో భార్యభర్తలిద్దరూ గురుకులాల్లో పీఈటీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అదే విధంగా ఆవుల శ్రీనివాస్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ–2024 లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ డైరెక్టర్) విభాగంలో జిల్లాస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. గత నెల విడుదలైన గురుకుల ఫలితాల్లో పీఈటీ ఉద్యోగం సాధించిన ఆవుల శ్రీనివాస్ డీఎస్సీ ఫలితాల్లో కూడా స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ డైరెక్టర్) ఉద్యోగం సాధించారు. ఒకే సారి రెండు ఉద్యోగాలు సాధించి శ్రీనివాస్ ఆదర్శంగా నిలిచాడు. ఒకే కుటుంబంలోని భార్యభర్తలిద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆ దంపతులను అభినందిస్తున్నారు.



ఉద్యోగం సాధించిన దంపతులు ఆవుల శ్రీనివాస్, బాలమణి